"ఏమండీ ! నాకు రిజర్వేషన్ చేయించండి ! పెళ్లి పురుడు అవగానే వచ్చేస్తాను" అంది నరేంద్రతో.

ఆలోచనలతో బుర్ర వేడెక్కివున్న నరేంద్ర భార్య మాటలకి తెల్లబోయి చూసాడు. "మరి వెయ్యి రూపాయలెక్కడినుంచి తేను ?" అన్నాడు.

"మీ ఆఫీసులో ఎవరినన్నా అడగండి. నేనెలాగూ వెళ్తున్నాను కదా ? నా ఖర్చు తగ్గుతుందిగా ! మెల్లగా ఆ డబ్బుతో తీర్చేద్దురు గాని" అంది.

"భార్య మంచితనానికి మరో నిదర్శనం" అనుకుంటూ ఆప్యాయంగా ఆమె భుజంమీద చెయ్యి వేస్తూ — "నీ చేదోడు లేకపోతే నేను ఈ భారాన్ని మొయ్యగలిగే వాడినా కల్యాణీ ? నన్ను కట్టుకుని ఏం సుఖపడుతున్నావు ? ఒక్క ముద్దూ—ముచ్చటా లేదు సరికదా ! నే బ్రతికుండగా తీర్చలేనేమో కూడా ..." అంటూ వుండగానే, అతని నోటిని తన చేత్తో మూసి—"ఏమిటా అపశకునాలు !" అంది చిరుకోపంతో.

* * *

పెళ్లయ్యాక అత్తవారింట్లో ఇన్నాళ్లుండటం ఇదే తొలిసారి. ఈ మూడేళ్ళల్లో భర్తతో కలిసి వెళ్లి అత్తింటా, పుట్టింటా చెరో పదిహేనేసి రోజులూ వుండి, తిరిగి అతనితో కలిసి వెళ్లిపోయేది. ఇదివరకు కన్నా ఇప్పుడు ఆ ఇంటి గురించి ఇంకా ఎన్నో తెలియని విషయాలు తెలుసుకుంటోంది. ఈసారి ఇంటెడు చాకిరీ కల్యాణి నెత్తినపడింది. మంచం దిగని అత్తగారికి అన్నీ మంచం దగ్గరకి అందివ్వాలి. కోడలొచ్చేరోజు వరకూ వంటచేసుకునే అత్తగారికి, కల్యాణిని చూడగానే మరీ నీరసం వచ్చి పూర్తిగా మంచమెక్కేసింది. కొద్దోగొప్పో ఆడ, మగా తల్లికి సహాయం చేస్తున్న పిల్లలికి కూడా వదినరావడంతో తమకింకేం బాధ్యత లేనట్టుగా ఇంటిని పట్టించుకునేవారు కాదు. ఇరవై ఏళ్ళు నిండిన కల్యాణి ఇంటెడు చాకిరీతో సతమతమయి పోయేది. రాత్రి పదకొండు దాకా చాకిరీ చేసి పడుకునేసరికి, అత్తగారికి ఏ నీరసమో అంటూ పళ్లరసాలూ, హార్లిక్స్‌లూ ఇవ్వడానికి రాత్రిళ్ళు కూడా లేవవలసి వచ్చేది. పగలూ, రాత్రికూడా విశ్రాంతి లేకుండా చాకిరీతో సతమతమవుతుంటే, ఇంట్లో ఏ ఒక్కరి మొహంలోనూ జాలీ, దయా అన్నది కనపడేదికాదు. కనీసం నువ్వు తిన్నావా ? తాగేవా ? అనే దిక్కుకూడా లేకపోయేది. ఇంత గొడ్డుచాకిరీ చేస్తున్నా ఏ ఒక్కరిలోనూ తృప్తి కనపడేది కాదు. పైగా ఏదో లోటొచ్చినట్టు వెటకారాలూ, సాధింపులూ ఎక్కువయిపోతున్నాయి.

భర్తతో వచ్చినప్పుడు వీరి రంగు బయట పడలేదు. ఇప్పుడు ఆ ఇల్లు నరకంలా వుంది కల్యాణికి. ఎంత త్వరగా అత్తగారికి పురుడొస్తుందా? ఎప్పుడు భర్త దగ్గరికి వెళ్లిపోదామా ? అని ఎదురు చూడసాగింది. రోజులూ నిముషాలు, లెక్కపెట్టేది.

* * *

నరేంద్ర దగ్గరనుంచి తనకో వుత్తరం, మామగారికో వుత్తరం వచ్చింది. తన వుత్తరంలో ఎప్పటి విషయాలే వ్రాశారు.

మామగారు మాత్రం తన వుత్తరాన్ని చదివి చిందులు తొక్కుతున్నాడు. "ఇందుకేనా ఈ వెధవల్ని కని, చచ్చి చెడి పెంచి చదివించాం. వీళ్లని ఎంత కష్టపడి పెంచకపోతే ఇంతింతవాళ్లయ్యారు? మన సుఖం, సంతోషాలు మానుకొని, ఎకరం భూమి కూడా అమ్మి చదివిస్తే ఆ వెధవ అయిదొందలు కావాలంటే పంపలేనని రాస్తాడా ? ఎనిమిదొందలు సంపాదిస్తున్నాడు, ముష్టి మూడొందలు ఇంత మందిని సర్దుకోమని పంపి వాడొక్కడూ అయిదొందలేం చేస్తున్నాడు ? ఇష్టం లేకపోతే రాసెయ్యొచ్చుగా ? ఏవేవో వంకలెట్టడమెందుకు ?" అంటూ కల్యాణికి వినపడేలా రంకెలేస్తున్నాడు.

కాఫీ ఇవ్వడానికి వెళ్లిన కల్యాణితో అత్తగారు, "చూశావుటే కల్యాణీ ! నీ మొగుడి రాతలూ ! ఎంత ధైర్యమే ? ఏనాడేనా మేమలా జవాబులు చెప్పేమా ? ఇందుకేనా మేము వీళ్లని పెంచింది ? వీడేదో చదువుకుని తమ్ముళ్లనీ, చెల్లెళ్ళనీ చదివించి, చెల్లెళ్ల పెళ్లిళ్ళు చేస్తాడని ఆశపడ్డాం. తల్లి తండ్రులకే పెట్టనివాడు ఇంక వాళ్లనేంచూస్తాడే?" అంటూ రాగాలు తీయడం ప్రారంభించింది.


ఆంధ్ర పత్రిక
దిన పత్రికలో
* మన సినిమాలు
* ప్రేక్షకుల తీర్పు
శీర్షికలు
చూస్తున్నారా ?


అత్తగారితో మెల్లిగా పట్నవాసపు ఖర్చుల గురించి, అక్కడ తమ ఇబ్బందుల గురించి చెప్ప ప్రయత్నించింది. అన్నీ విన్న అత్తగారు కల్యాణిమీద ఛర్రున లేచి, "అంత కష్టపడిపోతూ మాకు మీరేం పెట్టనక్కరలేదమ్మా ! మీరు పంపే ముష్టి మూడొందలతోటే మా బ్రతుకులు తెల్లారి పోతాయా ? అయినా పెళ్లాలు అల్లాలూ, బెల్లాలూ ! మీరూ, మీ సదుపాయాలూ, విలాసాలూ చూసుకుని మీకు మిగిలింది మాకు పంపిస్తారు. అక్కరలేదమ్మా ! ఆ మూడొందలూ మీరే దాచుకోండి" అంటూ సాధించడం ప్రారంభించింది.

ఇంక అత్తగారికి ఏం చెప్పి లాభంలేదనుకొన్న కల్యాణి మౌనంగా వంటింట్లోకి వెళ్లిపోయింది. "ఛీ, ఏం మనుష్యులు ! ఎంత చేస్తే మెప్పు పొందగలం ? ఎంత పెడితే సరిపోతుంది ? ఇలా ఇంకా పిల్లల్ని కంటూ వాళ్లని పెంచలేక బాధ పడుతూ, వాళ్ల కష్టాలకి తమని బాధ్యుల్ని చేసి నిందిస్తారేమిటి ? కాలాన్నిబట్టి నడుచుకోవాలన్న జ్ఞానం వీళ్లకి లేకపోగా, తన కొడుకు డబ్బు దొరకక పంపలేనని రాశాడని, తల్లితండ్రుల్ని ఖాతరు చెయ్యటంలేదని నిందిస్తారేమిటి ?"

ఆనాటినుంచి తమ కష్టాలకి కల్యాణే కారకురాలని, కల్యాణే నరేంద్రని మార్చేసిందనీ, తల్లితండ్రులకి కాకుండా చేసిందనీ, మొగుణ్ణి కొంగుని కట్టేసుకుందనీ, సాధించే సాధింపులు రోజు రోజుకి ఎక్కువయ్యాయి. "పెళ్ళానికి అన్నం పెట్టడమే ఎక్కువనుకునే వాళ్లు కొడుక్కి పెళ్లెందుకు చేశారు ?" అనుకునేది కల్యాణి. ఇంట్లో చాకిరీ బాధకన్నా అత్తగారి సాధింపుల బాధ ఎక్కువయిపోయింది.

* * *

అత్తగారికి తొమ్మిదో నెల నిండింది. డాక్టర్ త్వరలోనే పురుడు రావచ్చని చెప్పేడు. నీరసంగా వున్నందున హాస్పిటల్లో పురుడు పోసుకోవడం మంచిదన్నాడు. ఆ రాత్రి పన్నెండింటికి కల్యాణి బాత్‌రూమ్‌కని లేచింది. మామగారు అత్తగారి గదిలోకి వెళ్లి తలుపేసుకోవడం కళ్లారా చూసింది. కల్యాణి వళ్లు గగుర్పొడిచింది. అసహ్యంతో వళ్లంతా జలదరించింది. తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది.

పావుగంట పోయాక మామగారు కల్యాణి గది తలుపు తట్టి, "మీ అత్తగారికి నీరసం వచ్చిందిటే ! కాస్త గ్లూకోజో, హార్లిక్సో ఇయ్యి !" అంటూ వెళ్లిపోయాడు. కల్యాణికి మామగారిని చూస్తే చెప్పలేని అసహ్యం వేసింది. "అత్తగారికి నీరసం తెప్పించేది తనూ, సపర్యలు చెయ్యవలసింది నేనూ" అనుకుంటూనే వెళ్లి హార్లిక్సు ఇచ్చి వచ్చింది.

"రోజూ అత్తగారికి రాత్రిళ్ళు నీరసం రావడానికి కారణం ఇప్పుడర్థమయింది. ఆరోగ్యం గురించిన శ్రద్ధ ఇద్దరికీ లేదా ? ఇంత వయసొచ్చిన వాళ్లే కోరికల్ని అదుపులో పెట్టుకోలేకపోతూ, తమని నిందిస్తారెందుకు ? కుటుంబానికీ, దేశానికీ భారాన్ని పెంచుతున్నారు. వాళ్లని పెంచలేక బాధ పడుతున్నారు. పైగ "ఎంత కష్టపడి పెంచామో" అంటారు."

* * *

అత్తగారిని ఆసుపత్రిలో చేర్పించారు. పురుడొచ్చింది, మళ్లీ ఆడపిల్ల. కానుపు "చావు తప్పి..." అన్నట్టు అయింది. ఆమె ఆరోగ్యం గురించి ఆమె అక్కడ ఇంకా పది రోజులపాటు వుండాలన్నారు డాక్టర్లు.

* * *

తండ్రిచ్చిన టెలిగ్రాము అందుకుని ఖంగారు పడుతూ వచ్చాడు నరేంద్ర. తండ్రి చెప్పిన మాటలన్నీ విన్న నరేంద్ర "ఇది నిజమేనా ? నిజమే అయివుంటుందా ?" అని తన్నుతాను పదే పదే ప్రశ్నించుకుంటున్నాడు.

కల్యాణి వైఖరి తమకేం నచ్చలేదనీ, చాలా పెంకెదనీ, నీ డబ్బంతా మేం తినేస్తున్నామని అస్తమానూ దెప్పేదనీ, ఇంట్లో అత్తగారిని, ఆడబిడ్డల్ని అనరాని మాటలు అనేదనీ, ఆమె చాలా పొగరుమోతనీ, తమ లేమితనాన్ని నిందిస్తూ, చీత్కరించుకునేదనీ చెప్పి, ఆమె గుణం కూడా మంచిదికాదనీ, అత్తగారు ఆసుపత్రిలో వున్న సమయంలో పొరుగింట్లోఅద్దెకుంటున్న అబ్బాయితో పరాచికాలాడేదనీ, ఓ రోజు పట్టుకుని తిట్టగానే ఇంట్లో పిల్లలు బడికెళ్లిన టైములో, తను లేని సమయం చూసి పారిపోయిందని చెప్తుంటే తన చెవుల్ని తానే నమ్మలేకపోయాడు. మూడేళ్ల తమ దాంపత్య జీవితంలోకూడా ఆమెలో ఒక దుర్గుణం గానీ, ఒకర్ని దూషించడంగానీ ఎరుగడు. అలాంటి కల్యాణి ఇంతలా ఎలా మారిపోతుంది ? అన్నదే



# మామ పోరు

అతని ఆవేదన. ఇటు పిల్లని ఏమీ అనలేని అసమర్థత, ఏం చెయ్యలేని నిస్సహాయత, అన్నీ కలిసిన వేదన. అసలు జరిగిందేమిటో రాబట్టాలని ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఇంట్లో అందరి నోట తండ్రి ఆడిన మాటలకి పర్యాయ పదాలే వచ్చేవి తప్ప ఒక్కరూ కల్యాణి గురించి మంచి చెప్పలేదు. అన్నీ వింటుంటే తనలోనూ అనుమానం కలిగింది. కానీ మనస్సు ఏమాత్రం అంగీకరించనివ్వలేదు. ఓ ప్రక్క అనుమానం, ఓ ప్రక్క అంతుతెగని ఆలోచనలు నరేంద్రని పిచ్చెక్కించేస్తున్నాయి.

శలవు లేదంటూ వెళ్ళిన మర్నాడే నరేంద్ర తిరిగి పట్నం వచ్చేశాడు. ఇంటి తాళం తీసి లోపలికి వెళ్ళేడు. గ్రాడేజ్ కుర్చీ దగ్గర నేలమీద చిన్న కవరు వుంది. ఆదుర్దాగా విప్పి చూశాడు. ఆ వుత్తరం తలుపు క్రిందనుంచి త్రోశారెవరో! అది కల్యాణి రాసింది.

శ్రీవారికి, నమస్కారాలు.

నేను అనుకున్నట్టుగానే మీరు మీ వూరు వెళ్ళినట్టు ఈ తాళంకప్ప చెప్పింది. నా వుత్తరం చూసి ఆశ్చర్యపోతున్నారు కదూ? మీవాళ్ళు — ముఖ్యంగా మీ నాన్నగారు నా గురించి మీకు ఏంచెప్పిందీ నేను ఊహించుకోగలను. మీరు ఆ విషయాన్ని ఎంతవరకూ నమ్ముతారోకూడా నాకు తెలుసు. అందుకే నిజానిజాలు తెల్పడానికి మీకీ వుత్తరం రాస్తున్నాను.

మీ కుటుంబంలోకి కోడలిగా వచ్చినా, కూతురి స్థానాన్ని సంపాదించుకోవాలని నేను పడ్డ శ్రమంతా వృధా అయింది. కట్నం కోసం కొడుక్కి పెళ్ళి చేశారేగాని కోడలికి కానీ ఖర్చు చెయ్యకూడదనే మనస్తత్వాలు గల మీ కుటుంబంలోవారి మధ్య మసలడం నాకు చేతనవలేదు. నావల్ల మీరు మీవాళ్ళందరికీ దూరమయ్యారని, నేనే మీ వాళ్ళకి కాకుండా చేస్తున్నానన్న నిందల్ని మౌనంగా భరించాను. మన సాధక బాధకాల్ని అర్థం చేసుకోక, తమ తప్పనడవడికల్ని అరికట్టుకోలేక అన్నింటికీ పరాయి ఇంటినుంచి వచ్చిన నన్ను నిందించేవారు. మీ కుటుంబంలోని సుఖ, సంతోషాల్ని లాక్కున్న పిశాచిలా మీవాళ్ళకి కనపడుతున్నాను. నేను పిల్లలు లేనిదాన్నవడంచేత వాళ్ళ కష్టాలని అర్థం చేసుకోలేక పోతున్నానని నిందించడమేకాక, నేను గొడ్రాలినని అందరికీ చెప్పేవారు. అందుకు కారణం మనిద్దరికీ తెల్సు. మనకి పిల్లలు పుడితే మీ కుటుంబానికి సహాయపడలేమన్న భయంతో మీరు ఆపరేషన్ చేయించుకుంటానంటే వద్దనలేదు. మరుదులూ, ఆడబిడ్డలే మన పిల్లలనుకున్నాము. ఈ నిజాన్ని మీవాళ్ళతో చెప్పకుండా మౌనంగా వాళ్ళనేవన్నీ సహిస్తున్నకొద్దీ వాళ్ళు నన్ను చాతకానిదానిగా, దోషిగా చూశారేతప్ప నన్నర్థం చేసుకోలేదు.

ఏ స్త్రీ అయినా తను చేసిన పనిని మెచ్చుకుని, ఆమెని కొంచెం పొగిడితే ఆమె మనస్సు పులకరించి, ఆనందంతో ఆమె ఆ వ్యక్తులకి జీవితాన్నంతా ధారపోస్తుంది. కానీ నా విషయంలో విరుద్ధంగా జరిగింది. ముఖ్యంగా ఆ కుటుంబంలోని అశాంతికి కారణం మీ నాన్నగారి 'కామం' అయినప్పటికీ, అది వాళ్ళు గుర్తించటంలేదు. పురిటినొప్పులు ప్రారంభమయ్యేవరకూ భార్య మంచం వదలని మీ నాన్నగారిని తల్చుకుంటే ఎంతలా అసహ్యం కలిగేదో వ్రాయలేను. ఆఖరికి మీ నాన్నగారి కామం ఎక్కడికి దారితీసిందంటే, ఆసుపత్రిలో మీ అమ్మగారు వున్నన్ని రోజులూ భార్యకి దూరంగా వుండలేక పిచ్చివానిలా తయారయి, నాతో సరసాలాడటం ప్రారంభించడంతో నాకు ఒక విధమైన భీతి, అసహ్యం కలిగేయి. ఒకరోజు పిల్లలు బడికి వెళ్ళిన సమయంలో మధ్యాహ్నం నేను నిద్రపోతుండగా నా గదిలోకి వచ్చిన మీ నాన్నగారి ప్రవర్తన, రాయడానికి అసహ్యంవేసి వ్రాయలేకపోతున్నాను. ఆయనలోని కామపిశాచికి నేను బలైపోయాను.

ఇదంతా రాసి మీవాళ్ళమీద మీకు ద్వేషాన్ని కలిగించాలని నా వుద్దేశం కాదు. మీరు నా గురించి మరోలా భావించకుండ వుండటానికిగాను, నిజాన్ని తెలియజేస్తున్నాను. నన్ను మన్నించండి. నేను మీకు ఇంక ఎప్పుడూ కనబడను. కల్యాణి ఓడిపోయింది. నిస్సహాయురాలు. చెడిపోయింది. ఈ నిజాన్ని చెప్పే నవ్వేది మన కుటుంబాన్నే గనక మీ కుటుంబం పరువు కాపాడుకోడం మంచిది. ఆఖరిసారిగా కోరేది మిమ్మల్ని ఒక్కటే! మీరు మళ్ళీ వివాహం చేసుకుని నాలాంటి పరిస్థితి మరొక స్త్రీకి రానివ్వవద్దని కోరుతున్నాను. మీ ఇంటి బాధ్యతలు తీరిపోయి, మీవాళ్ళకి మీ అవసరం తీరేకా మీరు మళ్ళీ పెళ్ళి చేసుకోండి. మీ అమ్మగారిలాంటి అత్తగారిని, మీ నాన్నగారిలాంటి మామగార్ని కూడా వేడుకునే దేమంటే తమ తమ కొడుకులకి వివాహం చేసి కొడుకుల్ని తమకి దూరం చేసుకోవద్దని, తమ అవసరాలన్నీ తీరేకే వారికి వివాహాలు చెయ్యమని చెప్పండి.

ఇటువంటి కాముకులు తమ తమ తప్పులవల్ల దేశానికి బరువుని పెంచడమే కాకుండా ఇంట్లో వాళ్ళని కూడా సుఖపడనివ్వకుండా ఎదుటివారి జీవితాలని నాశనం చేస్తున్నారని తెలుసుకోమన్నానని చెప్పండి. వారి ఎదుటపడి మాటలతో చెప్పలేని అశక్తురాలిని.అందువల్ల రాతలతో తెలియచేస్తున్నాను. దేశంలో మనలాంటి కుటుంబాలు ఎన్నో వున్నాయి. అందులో నా కథ విన్నవాళ్ళల్లో కొందరన్నా కళ్ళు తెరుస్తారని ఆశిస్తున్నాను. ఇట్లు,

ఓడిపోయిన మీ కల్యాణి.

స్థాణువులా నిలబడిపోయిన నరేంద్ర కాళ్ళూ, చేతులూ వణుకుతున్నాయి. ఉత్తరాన్ని మడిచి చమటపట్టిన ముఖాన్ని కడుక్కుందామని దొడ్లో వున్న బాత్‌రూమ్‌లోకి వెళ్ళేడు. బాత్‌రూమ్ తలుపు తీసిన నరేంద్ర కొయ్యబారిపోయి, కెవ్వన వేసిన కేకకి ఇరుగుపొరుగు పరిగెత్తుకొని వచ్చారు.

బాత్‌రూమ్‌లో ఉరిపోసుకున్న కల్యాణి శవం భయంకరంగా, 'మీ ఆడవాళ్ళకి నా గతి పట్టనివ్వకండేం!' అన్నట్టు అందర్నీ చూసినవ్వింది. ●